కాంగ్రెస్ పతనం ఖాయం

- పాలనను ప్రజలు అసహ్యించుకుంటున్నారు
- ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు పట్టం కట్టాలి
- ఎన్నికల ప్రచారంలో నామా, వద్దిరాజు
- జోరువానలోనూ ఎన్నికల ప్రచారం

వైరాటౌన్, మే 5: రాష్ట్రంలో మాదిగలకు అన్యాయం చేసిన కాంగ్రెస్‌కు పతనం ఖాయమని ఖమ్మం పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం సాయంత్రం వైరా, తల్లాడ, కుర్నవల్లి గ్రామాల్లో జరిగిన రోడ్ షోలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే తన గెలుపునకు బాటలు అవుతాయని అన్నారు. వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ.. అబద్దాలు, మోసాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీని ప్రజలు అసహ్యించుకుంటున్నారని, 150 రోజుల వ్యవధిలోనే

కుర్నవల్లి రింగు రోడ్డు సెంటర్ కార్నర్ మీటింగ్‌లో పాల్గొన్న నామా, వద్దిరాజు, సండ్ర

మాట్లాడుతున్న ఎంపీ నామా నాగేశ్వరరావు

ప్రజలు కేసీఆర్ పాలనకు, కాంగ్రెస్ పాలనకు మధ్య గల వ్యత్యాసాన్ని చూస్తున్నారని అన్నారు. తెలంగాణ గళాన్ని పార్లమెంటులో బలంగా వినిపించే నాయకుడు నామా నాగేశ్వరరావు అని అన్నారు. కుర్రవల్లి రింగు రోడ్డు సెంటర్‌లో జరిగిన రోడ్డు కార్నర్ మీటింగ్‌ను ఉద్దేశించి సండ్ర వెంకటవీరయ్య మాట్లాడుతూ.. బీఆర్ఎస్ లోక్‌సభా పక్ష నేతగా నామా నాగేశ్వరరావుకే హక్కు ఉన్నదన్నారు. వైరా రింగు రోడ్డు సెంటర్‌లో జరిగిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్ మాట్లాడుతూ.. తెలంగాణలో ప్రతి కుటుంబం కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి ఫలాలు పొందారని, ప్రతిఒక్కరూ నామాకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. వైరా రింగు రోడ్డు సెంటర్‌లో వర్షాన్ని సైతం లెక్క చేయకుండా బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు సమావేశాన్ని ఆద్యాంతం తిలకించారు. కార్యక్రమంలో నాయకులు కట్టా కృష్ణార్జున్‌రావు, ముళ్ళపాటి సీతారాములు, బాణాల వెంకటేశ్వర్లు, మద్దెల రవి, మాదినేని ప్రసాద్, కొత్తా వెంకటేశ్వరరావు, కాపా మురళీకృష్ణ, కౌన్సిలర్లు దారెల్లి పవిత్రకుమారి, వనమా విశ్వేశ్వరరావు, తెల్లగుండ్ల నాగేశ్వరరావు, ధనేకుల వేణు, తడికమళ్ళ నాగేశ్వరరావు, తల్లాడలో రెడ్డం వీరమోహన్‌రెడ్డి, దుగ్గిదేవర వెంకటలాల్, దిరిసాల దాసురావు, శీలం కోటారెడ్డి, వనిగండ్ల అశోక్, పోతురాజు వెంకటయ్య పాల్గొన్నారు.

హాజరైన ప్రజలు

'గృహజ్యోతి' పథకం మాయాజాలం

- 200లోపు రీడింగ్‌కు జీరో బిల్ రాని వైనం
- 197 యూనిట్లకూ చెల్లించాలని వచ్చిన బిల్లు
- విద్యుత్ అధికారులను అడిగితే నిర్లక్ష్యపు సమాధానం
- అయోమయంలో లబ్ధిదారుడు

విద్యుత్ బిల్లు

రఘునాథపాలెం, మే 5 : కాంగ్రెస్ సర్కార్ ప్రభుత్వ పథకాల పేరుతో ప్రజలను నట్టేట ముంచుతోంది. పథకాలకు అర్హులైనప్పటికీ కొర్రీల పేరుతో నిరుపేదల జేబులకు చిల్లుపెడుతోంది. ఇందుకు ప్రత్యక్ష నిదర్శనమే 'గృహజ్యోతి' పథకాన్ని చెప్పుకోవచ్చు. 200 యూనిట్ల వరకు విద్యుత్ ఫ్రీ అంటూ పథకాన్ని తెచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం క్షేత్రస్థాయిలో చూస్తే ఇది పక్కాగా అమలుకావడం లేదనేది తెలుస్తోంది. ఖమ్మం నగరం పాండురంగాపురానికి చెందిన యాదా నాగలక్ష్మి తనకు ఉన్న విద్యుత్ సర్వీస్ నెంబర్ 30144-03124పై గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకుంది. నాగలక్ష్మిని అర్హురాలిగా గుర్తించిన విద్యుత్ అధికారులు మార్చి నెల రీడింగ్ 'జీరో' రావడంతో సంతోషించింది. కానీ ఏప్రిల్ నెల విద్యుత్ వినియోగానికి సంబంధించి శనివారం రీడింగ్ తీసేందుకు ఇంటికి వచ్చిన సిబ్బంది మొబైల్‌తో మీటర్‌పై స్కానింగ్ చేసి రూ.929 చెల్లించాలంటూ బిల్లును లబ్ధిదారురాలి చేతిలో పెట్టి వెళ్లిపోయాడు. అవాక్కైన నాగలక్ష్మి తన చేతిలోని బిల్లులోని పరిశీలించగా 197 యూనిట్లు మాత్రమే వినియోగించినట్లుగా ఉండటాన్ని గమనించింది. ప్రభుత్వం 200లోపు యూనిట్లు ఫ్రీ అన్నది కదా.. నేను అందుకు అర్హురాలినే కదా అని ఆలోచన చేసిన సదరు లబ్ధిదారురాలు వెంటనే విద్యుత్ అధికారులకు ఫోన్ చేసి విషయాన్ని అడిగింది. దీంతో సదరు అధికారి మీకు 29 రోజులకే బిల్లు తీశాము.. కానీ సిస్టమ్ 30 రోజులకు రీడింగ్ తీసుకున్నది అంటూ చావు కబురు చల్లగా చెప్పాడు. అదేంటి ఎప్పుడు తీసినా 200లోపు యూనిట్లు మాత్రమే వాడకం జరిగినదా కదా.. అని అడిగితే అంతేనంటూ ఇష్టం ఉన్నచోట చెప్పుకో అంటూ నిర్లక్ష్యపు సమాధానం సదరు లబ్ధిదారురాలి భర్తకు ఎదురైంది. చేసేది.. లేక గృహజ్యోతి పథకం అంతా మోసం అంటూ మిన్నకుండిపోయింది. చేసేది లేక జరిగిన పథకంలోని మోసాన్ని తెలియజేసేందుకు 'నమస్తే తెలంగాణ' పత్రికను ఆశ్రయించారు.

పార్లమెంట్ ఎన్నికల్లో 'నామా'ను గెలిపించండి

మాజీ మంత్రి పువ్వాడ విస్తృత ప్రచారం

ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నామా నాగేశ్వరరావును భారీ మెజార్టీతో గెలిపించాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఖమ్మం ఓటర్లను వేడుకున్నారు. ఆదివారం నగరంలోని 49వ డివిజన్‌లో ఇంటింటికీ వెళ్లారు. టిఫిన్ సెంటర్లు, కిరాణాదుకాణాలు, ఇస్త్రీషాపులు, టైలర్‌షాపులు, తాపీపని చేస్తున్న కూలీలను కలిసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాన్ని ఎండగట్టాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడానికి కేసీఆర్ ఎంత కష్టపడ్డారో వారికి వివరించారు. తొమ్మిదేండ్ల పాలనలో అన్నివర్గాల ప్రజల కోసం అమలుచేసిన సంక్షేమ పథకాలను గుర్తుచేశారు.

– ఖమ్మం, మే 5

ఈవీఎంల కమిషనింగ్ పకడ్బందీగా నిర్వహించాలి

కలెక్టర్ వీపీ గౌతమ్

మధిర, మే 5 : ఈవీఎం యంత్రాల కమిషనింగ్ పక్రియను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ వీపీ గౌతమ్ అన్నారు. ఆదివారం మధిర పాలిటెక్నిక్ కళాశాలలో మధిర అసెంబ్లీ సెగ్మెంట్‌కు చెందిన 268 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన బ్యాలెట్ యూనిట్‌లు, కంట్రోల్ యూనిట్‌లు, వీవీ ప్యాట్‌ల కమీషనింగ్ పక్రియను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మధిర వెళ్తున్న కలెక్టర్ వాహనాన్ని చెక్‌పోస్టు వద్ద చెక్‌పోస్టు అధికారులు ఆపి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని పరిశీలించి ఓటింగ్ పక్రియను తనిఖీ చేశారు. ఖమ్మం ఆర్డీవో గణేష్, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, కమిషనర్ ఎండీ షఫీయుల్లా, అధికారులు పాల్గొన్నారు.

వైరాటౌన్, మే 5: వైరా సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల, కళాశాలలో చేపడుతున్న వైరా సెగ్మెంట్ ఈవీఎం, వీవీ ప్యాట్ల కమీషనింగ్ ప్రక్రియను కలెక్టర్ గౌతమ్ ఆదివారం తనిఖీ చేశారు. సోమవారం లోగా కమీషనింగ్ ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలిపారు.

మధిరరూరల్, మే 5: మండల పరిధిలోని ఖాజీపురం గ్రామంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో భద్రపరిచిన ఈవీఎంలను కలెక్టర్ గౌతమ్ ఆదివారం పరిశీలించారు. అనంతరం ఈవీఎంల భద్రతపై అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో గణేష్, తహసీల్దార్ రాంబాబు, సర్కిల్ ఇన్స్పెక్టర్ మధుబాబు, భార్గవి, ఇతర శాఖ అధికారులు పాల్గొన్నారు.

మధిరరూరల్ : అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్

నామాను అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

- జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు
- ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

ఎర్రుపాలెం, మే 5: పార్లమెంట్ ఎన్నికల్లో నామా నాగేశ్వరరావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు అన్నారు. మండల పరిధిలోని శఖునవీడు గ్రామంలో బీఆర్ఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో నామా విజయాన్ని కాంక్షిస్తూ ఆదివారం జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. జడ్పీ చైర్మన్ కమల్‌రాజు స్వయంగా డోర్ పోస్టర్లను అంటించారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చావా రామకృష్ణ, జడ్పీటీసీ శీలం కవిత, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పంబి సాంబశివరావు, నాయకులు యన్నం శ్రీనివాసరెడ్డి, రామకోటేశ్వరరావు, కత్తి నాగేశ్వరరావు, భాస్కర్, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎర్రుపాలెం, మే 5: మండల పరిధిలోని రేమిడిచర్ల, జమలాపురం గ్రామాల్లో బీఆర్ఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పంబి సాంబశివరావు, నాయకులు కొండేపాటి సాంబశివరావు, మూల్కూరి శ్రీనివాసరావు, పురుషోత్తంరాజు, నరసింహారావు, కిశోర్‌బాబు, కాళేశ్వరరావు, కత్తి నాగేశ్వరరావు, భాస్కర్, కొల్లు నివాసరావు, చొప్పవరపు శ్రీను, ప్రసాదరావు, సాయి, నాయకులు పాల్గొన్నారు.

వేంసూరు, మే 5: మండలంలోని గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు ఆదివారం ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోస్టర్ అంటిస్తున్న జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు

ఎర్రుపాలెం: రేమిడిచర్లలో బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

వైరారూరల్, మే 5: వైరాలో ఆదివారం బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు ఎన్నికల ప్రచారానికి మండలంలోని కెజి సిరిపురం గ్రామం నుంచి బీఆర్ఎస్ నాయకులు కామినేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.

సత్తుపల్లి, మే 5: కల్లూరు మండలంలో ఆదివారం బీఆర్ఎస్ నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. నాయకులు పెడకంటి రామకృష్ణ, లక్కినేని రఘు, మేకల కృష్ణ, కిరణ్‌కుమార్, కమిలీ, కొరకొప్పు ప్రసాద్, సయ్యద్‌రావు, కొత్తపల్లి వెంకటేశ్వరరావు ఉన్నారు. కిష్టయ్యబంజరలో మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కాటంనేని వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో గడపగడపకు వెళ్లి కారు గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. తెరసాని రాజు, వేల్పుల ఆనందరావు, రవి, శ్రీకాంతచారి తదితరులు ఉన్నారు.

'అబద్ధాలతో అధికారంలోకి కాంగ్రెస్'

రఘునాథపాలెం, మే 5: కాంగ్రెస్ అబద్ధాలతో ప్రజలను మోసం చేసి అధికారాన్ని చేజిక్కించుకుందని బీఆర్ఎస్ నాయకులు ప్రజలను కోరారు. నామా గెలుపును కోరుతూ ఆ పార్టీ శ్రేణులు ఖమ్మం నగరంలోని పలు డివిజన్లలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. హెచ్ ప్రసాద్, చిలుమూరు కోటి, సీహెచ్‌వీ సుబ్బారావు, ఎండీ ఫయాజ్, కొట్టే నాగేంద్రబాబు, మేడబోయిన ఉపేందర్, కెచ్చె రాజు, అనిల్, కొండల్, మల్లేశం, తూటిపల్లి రమేశ్ పాల్గొన్నారు

పాండురంగాపురంలో..

ఖమ్మం 2వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వేంసూరు : లింగపాలెంలో ప్రచారం

వైరా రూరల్ : ప్రచారానికి బయల్దేరుతున్న బీఆర్ఎస్ శ్రేణులు

కల్లూరులో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

8న ప్రపంచ తలసేమియా దినోత్సవం

ఖమ్మం సిటీ, మే 5 : ప్రపంచ తలసేమియా దినోత్సవాన్ని ఈ నెల 8వ తేదీన సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో జరుపుతున్నామని సంస్థ కోశాధికారి పీ రవిచంద్ర అన్నారు. ఆదివారం ఖమ్మంలోని రితన్య ఆసుపత్రిలోని తలసేమియా డేకేర్ సెంటర్‌లో చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారుల కోసం రక్తదాన శిబిరాలు, వ్యాధిని అరికట్టేందుకు అవగాహన, ఉచితంగా మందులు పంపిణీ వంటి అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. వైద్యులు డీ నారాయణ మూర్తి, ఉపాధ్యక్షురాలు పీ పావని, ఉదయ్‌భాస్కర్, పీ అనిత, ఎన్ ఉపేందర్ పాల్గొన్నారు.

కుట్టు మిషన్ పంపిణీ

వైరాటౌన్, మే 5: లయన్స్‌క్లబ్ రీజన్ చైర్మన్ లగడపాటిప్రభాకర్, లక్ష్మీరాజ్యం పెళ్లిరోజు సందర్భంగా వైరాకు చెందిన నిరుపేద మహిళకు కుట్టు మిషన్‌ను అందజేశారు. డాక్టర్ కాపా మురళీకృష్ణ, ఉపేంద్రరావు, యు.శ్యామ్‌బాబు, లగడపాటి ప్రభాకర్, రమేశ్ పాల్గొన్నారు.

తోపుడు బండి వితరణ

వైరాటౌన్, మే 5: గ్రేట్ విజన్ క్లబ్ అధ్యక్షురాలు వుంద్రు వరలక్ష్మి ఆధ్వర్యంలో రీజన్ చైర్పర్సన్ లయన్ లగడపాటి ప్రభాకర్రావు, లయన్ లగడపాటి లక్ష్మీరాజ్యం దంపతుల పెళ్లిరోజు సందర్భంగా వారి ఆర్థిక సహాయంతో బ్రాహ్మణపల్లికి చెందిన కుక్కుల సంధ్యకు జీవనోపాధి నిమిత్తం తోపుడు బండిని అందజేశారు.

కేసు నమోదు

చింతకాని, మే 5 : మండల పరిధిలో నేరడ గ్రామానికి చెందిన రామకృష్ణపై కేసు నమోదైందని ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నేరడ గ్రామానికి చెందిన సీహెచ్ గంగరాజును రహదారి విషయంలో అకారణంగా దాడిచేయగా గాయాలయ్యాయి. గంగరాజు ఫిర్యాదు మేరకు రామకృష్ణపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మద్యం పట్టివేత

చింతకాని, మే 5 : మండల పరిధిలోని తిమ్మినేనిపాలెం గ్రామానికి చెందిన ఓ బెల్టు దుకాణానికి అక్రమంగా తరలిస్తున్న 36 మద్యం బాటిళ్ళను ఎస్సై షేక్ నాగుల్‌మీరా సిబ్బందితో కలిసి ఆదివారం నాగులవంచ వద్ద పట్టుకున్నారు. ఎస్సై మాట్లాడుతూ.. మద్యం విలువ రూ.6.500 ఉంటుందని, మద్యం బాటిళ్ళను సీజ్‌చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నందున ప్రతిఒక్కరూ నిబంధనలు పాటించాలని తెలిపారు. సదరు బెల్టు దుకాణ యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

'ఇద్దరికి గాయాలు'

కారేపల్లి, మే 5: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన ఘటన మండలంలో చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ఉసిరికాయలపల్లికి చెందిన లకావత్ రాజేశ్, లకావత్ రమేశ్ మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా సోలార్ పవర్‌ప్లాంట్ సమీపంలో మూలమలుపు వద్ద ఎదురుగా వస్తున్న ప్రైవేట్ ఆంబులెన్స్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలు కావడంతో స్థానికులు ఆసుపత్రికి తరలించారు. ఎస్సై రాజారాం ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

మృతదేహం లభ్యం

పెనుబల్లి, మే 5 : వీఎం బంజర గ్రామంలో రెండ్రోజుల క్రితం కనిపించకుండా పోయిన వ్యక్తి ఆదివారం శవమై కనిపించాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని సూరయ్య బంజరకు చెందిన భూక్యా రాము ఈ నెల 3వ తేదీన మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ సమావేశానికి హాజరై ఆ తర్వాత కనిపించకుండాపోయాడు. కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం వీఎం.బంజర శివారు బయన్నగూడెం చెరువు సమీపంలో మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు రాము మృతదేహంగా గుర్తించారు. వడదెబ్బకు గురై కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి అక్కడే చనిపోయి ఉంటాడని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

'కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలి'

ఖమ్మం ఎడ్యుకేషన్, మే 5 : ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతుల సంక్షోభానికి కారణమైన ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) వివాదం పరిష్కారం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన విద్యాశాఖ కమిషనర్‌ను ఆ బాధ్యతల నుంచి తొలగించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో దుర్గాభవాని, నాగమల్లేశ్వరరావు, వెంకన్న, రాంబాబు, సురేశ్, షరీఫ్ పాల్గొన్నారు.

ఈవీఎంల పరిశీలన

సత్తుపల్లిటౌన్, మే 5: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా సత్తుపల్లి జ్యోతినిలయం పాఠశాలలో ఆదివారం అధికారులు ఈవీఎంల కమిషనింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా 364 కంట్రోలింగ్ యూనిట్లు, 411 వీవీ.ప్యాడ్లు, 1099 బ్యాలెట్ యూనిట్లు ఉండగా ఒక్కో పోలింగ్‌స్టేషన్‌కు మూడు యంత్రాల చొప్పున పంపిణీ చేయడం జరుగుతుందని అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ తెలిపారు. ఇందుకోసం ఈవీఎంల్లోకి బ్యాలెట్ పేపర్లు పెట్టి ఎన్నికలకు సిద్ధం చేశారు. ఆర్డీవో రాజేంద్రగౌడ్, తహసీల్దార్ యోగేశ్వరరావు, వివిధ రాజకీయ పక్ష నాయకులు పాల్గొన్నారు.

ఈవీఎంలను పరిశీలిస్తున్న అధికారులు

ఓటు హక్కును వినియోగించుకోవాలి

సత్తుపల్లిటౌన్, మే 5: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధంలాంటిదని, ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటును నిర్భయంగా, నిజాయితీగా వినియోగించుకోవాలని కల్లూరు ఆర్డీవో రాజేంద్రగౌడ్, మున్సిపల్ కమిషనర్ రవి బాబు అన్నారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అర్బన్ పార్క్ నుంచి రింగ్‌సెంటర్ మీదుగా హనుమాన్‌నగర్ వరకు ఓటుహక్కు వినియోగంపై 2కే రన్ నిర్వహించారు. కార్యక్రమంలో మెప్మా పీఎల్ఎం గుడిపుడి సుజాత, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, అధ్యాపకులు మాధవి, రాజ్యలక్ష్మి, పీర్‌సాహెబ్, ఎన్‌సీసీ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

కాంగ్రెస్ కార్యకర్తల ఆందోళన

వైరాటౌన్, మే 5: స్థానిక నాయకుల ప్రమేయం లేకుండా బీఆర్ఎస్ నాయకులను పార్టీలో చేర్చుకోవడం నిలిపివేయాలని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఆదివారం వైరా ఎమ్మెల్యే కార్యాలయం ఎదుట కాంగ్రెస్ కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. కాంగ్రెస్ కార్యకర్తలు ఆగ్రహంతో కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన టెంట్లను కూల్చివేసి విద్యుత్ మీటర్ల ఫీజులను సైతం ధ్వసం చేశారు. క్యాంపు కార్యాలయానికి వచ్చిన ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్‌ను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ కార్యకర్తల అభీష్టం మేరకు మేము వ్యవహరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన సద్దుమనిగింది.

నిరసన చేపడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఆర్టీసీ అభివృద్ధికి కండక్టర్లే కీలకం..

మధిర, మే 5: ఆర్టీసీ అభివృద్ధికి డ్రైవర్లు, కండక్టర్లే కీలకమని ఖమ్మం ఆర్టీసీ రీజినల్ మేనేజర్ వెంకన్న అన్నారు. ఆదివారం స్థానిక ఆర్టీసీ డిపోలో ఆవరణలో 3, 4 త్రైమాసిక ప్రగతిచక్ర అవార్డులను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమష్టి కృషితోనే సంస్థ అభివృద్ధి సాధ్యమవుతుందని, డ్రైవర్లు, కండక్టర్లు వారు ఉద్యోగ ధర్మాన్ని బాధ్యతగా వ్యవహరించడం వల్ల సంస్థ లాభాల్లో నడుస్తుందన్నారు. రీజియన్ స్థాయిలో విధి నిర్వహణలో ప్రేరణగా నిలిచి అత్యధిక ఆదాయం సంపాదించారని అన్నారు. విధి నిర్వహణలో అత్యుత్తమ ఫలితాలను రాబట్టిన ఉద్యోగులకు నగదు అందించినట్లు వివరించారు. అన్ని విభాగాల ఉద్యోగులకు 11 రకాల ఆరోగ్య పరీక్షలను చేసి వచ్చే వైద్య సమాచారాన్ని బట్టి నిపుణులైన వైద్యులు సూచనలు సలహాలను అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బందిని శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు.

ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న అధికారులు